క్లుప్తంగా

సాయం చేయబోయి మృత్యుఒడిలోకి..


తనూజ్‌కుమార్

తిరుపతి రూరల్: వేరొకరికి సాయం చేయబోయి ఇంటర్మీడియెట్ విద్యార్థి మృతి చెందిన సంఘటన తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీ ఎంజీ బ్రదర్స్ లేఅవుట్‌లో చోటుచేసుకుంది. ఎంజీబ్రదర్స్ లేఅవుట్‌లో క్రికెట్ ఆడడానికి వెళ్లిన తనూజ్‌కుమార్, సాయి, భాను తోటి ఇంటర్మీడియెట్ విద్యార్థులు సమీపంలోని ఇంటికి వెళ్లి నీళ్లు అడిగారు. అయితే ఇంటి యజమాని నాగరాజరెడ్డి పైకప్పు ఇనుప రేకులు ఎత్తుతూ వారిని సాయం చేయమని కోరాడు. వారు రేకులు పైకి ఎత్తుతుండగా విద్యుత్ తీగలు తగిలాయి. విద్యుత్ షాక్ తగలడంతో తనూజ్‌కుమార్(17) అక్కడికక్కడే మృతి చెందాడు. సాయి గాయాల పాలవ్వగా భాను అదృష్టవశాత్తూ బయటపడ్డాడు. మృతుడు తనూజ్‌కుమార్ లింగేశ్వర్‌నగర్ పంచాయతీకి చెందినవాడు. ఇతని తండ్రి కె.శ్రీనివాస్ లింగేశ్వర్‌నగర్ పంచాయతీ గ్రామ సచివాలయం వైఎస్‌ఆర్ సీపీ కన్వీనర్. ఈ ఘటన విషయం తెలియడంతో మృతుని తల్లిదండ్రులు, బంధువులు నాగరాజరెడ్డి ఇంటిపై దాడికి దిగారు. నాగరాజరెడ్డి 100 ఫోన్ చేయడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. స్వల్పగాయాల పాలైన సాయిని ఆస్పత్రికి తరలించారు. తిరుపతి రూరల్ ఎస్ఐ పూర్యా నాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే జగనన్న లక్ష్యం


లబ్ధిదారులకు కంటి అద్దాలు అందజేస్తున్న మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి సిటీ: ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష పేర్కొన్నారు. శనివారం 22వ డివిజన్‌లో కంటి అద్దాలను లబ్ధిదారులకు అందించారు. ఆమె మాట్లాడుతూ డాక్టర్ వైఎస్‌ఆర్ కంటి వెలుగు పథకం ద్వారా అందరికీ కంటి పరీక్షలు చేయడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమమన్నారు. వైఎస్‌ఆర్ సీపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తరలి వచ్చిన భక్త కోటి




శ్రీనివాస మంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం, పుష్పాలతో అలంకరించిన ధ్వజస్తంభం

చంద్రగిరి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్త జనం తరలి వచ్చి శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలను టీటీడీ వేడుకగా నిర్వహించింది. ఆలయాన్ని వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం 3 గంటలకు ధనుర్మాసంలో వైకుంఠ వాకిలి ద్వారాన్ని తెరిచి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉదయం 7గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ఆస్థానం నిర్వహించారు. ఆలయ అధికారులు మహాలఘు దర్శనాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుని, అన్న ప్రసాదాలను అందించారు. డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపినాథ్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు చక్రస్నానం

వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం ద్వాదశి సందర్భంగా స్వామి వారికి చక్రస్నాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తెల్లవారుజామున అధికారులు చక్రస్నాన ఘట్టాన్ని నిర్వహించనున్నారు.

పాదాల మండపంలో వైకుంఠ ద్వార దర్శనం

తిరుపతి కల్చరల్: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం శ్రీగోవిందరాజ స్వామి, శ్రీకోదండరామ స్వామి ఆలయాలు, కొత్త వీధిలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు షిర్డిసాయి మందిరం, ఇస్కాన్ మందిరాలను పలు పుష్పాలు, ఫలాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. అలిపిరి పాదాల మండపంలో గురువారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్తర ద్వారం ఏర్పాటు చేసి భక్తులు దర్శన భాగ్యం కల్పించారు. దీంతో పాదాల మండపానికి భక్తులు పోటెత్తారు. టీటీడీ గార్డెన్ విభాగం మేనేజర్ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. పుష్పాలను భక్తులు టీవీ.మనోహర్, కాసరన హరీష్, ఆదం దశరథరామరెడ్డి, శిల్పం విద్యాసాగర్, రెడ్డెమ్మ అందజేశారు. డెప్యూటీ ఈవో ఆర్.శాంత, ఏఈవో మునికృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు, షరాబు పి.దేవయ్య పాల్గొన్నారు.

గోవింద నామాలతో మార్మోగిన ఆలయాలు

రామచంద్రాపురం: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం మండలంలోని ఆలయాలు గోవింద నామస్మరణతో మారుమోగాయి. ఇందులో భాగంగా రాయలచెరువుపేటలోని శ్రీ రాధారుక్మిణి సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయాన్ని గ్రామస్తులు విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు రాజగోపాల్ అయ్యంగార్ స్వామి అమ్మవార్లను వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. రాయలచెరువుకట్ట వద్ద ఉన్న శ్రీ భవానీ జలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పూజలో పాల్గొన్న భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యంతోపాటు తీర్థప్రసాదాలను అందజేశారు.

క్రీడా ప్రతిభను చాటేందుకే ఆడుదాం..


ఆడుదాం ఆంధ్రా బ్యానర్‌తో ర్యాలీ

చంద్రగిరి: విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడా ప్రతిభను చాటేందుకు ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమం ఓ చక్కటి వేదికగా మారనుందని మండల ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఈఓపీఆర్డీ శశిరేఖ ఆధ్వర్యంలో స్థానిక టవర్‌క్లాక్ సర్కిల్ నుంచి విద్యార్థులతో కలసి ఆడుదాం ఆంధ్రా బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. కొత్తపేట, పాతపేట మీదుగా తిరిగి టవర్‌క్లాక్ సర్కిల్ చేరుకున్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి మండల వ్యాప్తంగా కూడా ఆడుదాం ఆంధ్రా పోటీలు అంబరాన్నంటేలా చేపడుతామన్నారు. ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్ బాబు, ఎంపీటీసీలు బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, మాధవరెడ్డి, ఈఓ మహేశ్వరయ్య, నాయకులు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పసల నాగరాజు, ఆదినారాయణరెడ్డి, మునిరాజ పాల్గొన్నారు.

పాకాలలో...

పాకాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఎంపీడీఓ ప్రభాకర్ ఆధ్వర్యంలో ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, సర్పంచ్ ఎస్.కస్తూరి, ఈఓపీఆర్డీ మాలతి, ఈఓ మోతి పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో...

రామచంద్రాపురం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో 2కె రన్ చేపట్టారు. కోఆర్డినేటర్ రామకృష్ణ, పాఠశాల పీడీలు సుబ్రమణ్యంరెడ్డి, గోపీనాథ్, భార్గవి, దేవరాజ్, ఈఓపీఆర్డీ దేవిక, పంచాయతీ సెక్రటరీలు పద్మరాణి, సురేష్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికి అయోధ్యరాముని అక్షింతలు


సుబ్రమణ్యస్వామి ఆలయంలో అక్షింతలు పంపిణీ

పాకాల: మండలంలోని ప్రతీ ఇంటికి అయోధ్య రాముని అక్షింతలు సరఫరా కార్యక్రమాన్ని పరమపవిత్రంగా నిర్వహించినట్లు శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరామచంద్రుని ఆలయ నిర్మాణం పూర్తి చేసుకుని 2024వ సంవత్సరం జనవరి 22వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని వివరించారు. అదే సమయంలో అక్షింతలు పొందిన వారు, తమ కుటుంబంలోని సభ్యులు అందరూ పూజా కార్యక్రమాలు నిర్వహించుకుని అక్షింతలు తలపై చల్లుకుని శ్రీరాముని ఆశీస్సులు పొందాలని తెలిపారు. సర్పంచులు గౌరీశంకర్‌రాజు, గరిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బాలశంకర్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు ప్రసాద్, వెన్నెల, రమేష్, భాస్కర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది ప్రకాష్ పాల్గొన్నారు.



ఇల వైకుంఠమై.. అలరారెను..

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారంతుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరాలయం ఇల వైకుంఠమై అలరారింది. భక్త జనం బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. - తిరుపతి రూరల్


తుమ్మలగుంటలో బారులుతీరిన భక్తజనం


భూమనకు ఆహ్వానం పలుకుతున్న భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి,


తీర్థం స్వీకరిస్తున్న వేమిరెడ్డి దంపతులు


కళాకారుల నృత్య ప్రదర్శన


సీఎం సలహాదారు అవినాష్‌తో...


వైకుంఠద్వార దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు

ఘనంగా జగదీష్‌రెడ్డి జన్మదినం


జగదీష్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు చొక్కారెడ్డిగారి జగదీష్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు పలుచోట్ల సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అన్నదానాలు చేశారు. పేదలకు దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు. తుడా చైర్మన్, వైఎస్‌ఆర్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తుమ్మలగుంటలో కేక్ కట్ చేసి, జగదీష్‌రెడ్డికి తినిపించారు. పేదలకు సాయం అందించడంలో జగదీష్‌రెడ్డి ముందుంటారని కొనియాడారు. రవితేజారెడ్డి, దిలీప్ రెడ్డి, గిరీష్, సాయి, భాను, భార్గవ్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమంతోనే దేశం సుభిక్షం

తిరుపతి కల్చరల్: రైతులు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం తెలిపారు. రాస్ సేవా నిలయంలో శనివారం చిన్నగొట్టిగలుల, రొంపిచెర్ల, పులిచెర్ల మండల రైతు సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ రైతు దినోత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కృషి విజ్ఞాన కేంద్రం, రాస్ ద్వారా 20 ఏళ్ల నుంచి రైతులకు శిక్షణ ఇవ్వడం, తక్కువ ఖర్చుతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తక్కువ నీటితో అధిక దిగుబడులు ఇచ్చే కొత్త వంగడాలను రైతులకు పరిచయం చేస్తూ అవగాహన కల్పిస్తోందన్నారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని ౹150 మంది రైతులకు రూ.12 లక్షలు రైతు సంఘాల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ అధికారి మొగిలీశ్వర్, రాస్ కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు, రిటైర్డ్ ఎస్‌బీఐ అధికారి అంకమనాయుడు, రాస్ డైరెక్టర్ వి.నాగరాజు సిబ్బంది నాగేశ్వర్, సీఎన్ నాయుడు, భానుప్రసాద్, రవి పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన రైతులు, సంస్థ ప్రతినిధులు

తిరుపతి సిటీ: తిరుపతి జువారీ అగ్రి ల్యాబ్‌లో శనివారం జాతీయ రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి, జువారీ ఫామ్ హబ్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ డాక్టర్ బి.సుధానంద్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి, ప్రసంగించారు. రైతులు అత్యాధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నాణ్యమైన దిగుబడిని పెంచుకోవాలన్నారు. వ్యవసాయ రంగంలో నానో టెక్నాలజీ ఎంతో ప్రధాన భూమిక పోషిస్తోందన్నారు. రైతులు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటించి, భూసార పరిరక్షణను అనుసరించి ఎరువులను వాడుకోవాలని సూచించారు. మార్కెటింగ్ ఆఫీసర్ సిద్ధారెడ్డి, ఉమ్మడి జిల్లాల నుంచి పెద్ద సంఖ్య రైతులు హాజరయ్యారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర మంత్రి ఆర్‌కే రోజా, ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్, ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేష్‌లు వేర్వేరుగా దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

తుడా కార్యదర్శికి సత్కారం


తుడా కార్యదర్శి వెంకట నారాయణను సత్కరిస్తున్న గిరిజన నేతలు

తిరుపతి కల్చరల్: తుడా కార్యదర్శిగా నూతనంగా నియమితులైన డాక్టర్ జి.వెంకటనారాయణను శ్రీహథీరాం ట్రైబల్ బంజారా వెల్ఫేర్ సొసైటీ నేతలు శనివారం ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈ మేరకు తుడా కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రామావత్ సునీల్ కుమార్ నాయక్, శ్రీను, హనుమంత్‌నాయక్, మనోహర్ పాల్గొన్నారు.



